క్లుప్తంగా

ప్రచార పోస్టర్ల విడుదల



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

చింతకొమ్మదిన్నె : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గురువారం ఆబ్కారి (ఎక్సైజ్) శాఖ అధ్వర్యంలో నాటుసారా నిర్మూలనకు ప్రచార పోస్టర్లను తహసీల్దార్ నాగేశ్వరరావు ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె పోలీస్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ నాయక్, కడప ఫారెస్ట్ రేంజరు ప్రసాద్, ఎంఈఓ వెంకటరామిరెడ్డి, ఆబ్కారి(ఎక్సైజ్) సీఐ, ఎస్‌ఐ పాల్గొన్నారు.

అమెరికా దుశ్చర్యలపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

జమ్మలమడుగు : అమెరికాలో అక్రమంగా చోరబాటు దారులంటూ భారతీయుల పట్ల అమానుషంగా అమెరికి ప్రవర్తించడం పట్ల డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గురువారం స్థానిక పాత బస్టాండ్‌లో అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకుడు ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు



వైఎస్ ఆదిత్యారెడ్డి పుట్టిన రోజు కేకేను కట్ చేస్తున్న సిబ్బంది

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నివాసంలో గురువారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కుమారుడు వైఎస్ ఆదిత్యారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కార్యాలయ సిబ్బంది రమణారెడ్డి, సుబ్రమణ్యం తదితరులు ఎంపీ కుమారుడు వైఎస్ ఆదిత్యారెడ్డి 6వ పుట్టిన రోజు కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

నలంద విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో కరస్పాండెంట్ సోమేశ్వరరెడ్డి

పులివెందుల టౌన్ : జాతీయస్థాయి ఇంగ్లీషు ఒలంపియాడ్‌లో నలంద పాఠశాలకు చెందిన 17 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని కరస్పాండెంట్ సోమేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటస్వామిరెడ్డి మాట్లాడుతూ ఒలంపియాడ్ పరీక్షలో పాల్గొనడంవల్ల విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన పెంపొందించుకుంటారన్నారు. అనంతరం బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్‌తోపాటు ప్రిన్సిపాల్ వెంకటస్వామిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ విజిత, హెడ్మాస్టర్ సర్వేశ్వరరెడ్డిలు అభినందించి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల చేరువలోకి తపాలా



తపాలా కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న సూపరింటెండెంట్ రాజేష్

చక్రాయపేట : తపాలా సేవల పట్ల ప్రజలు ఎంతో విశ్వాసంతో ఉన్నారని కడప తపాల శాఖ సూపరింటెండెంట్ రాజేష్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక తపాల శాఖ కార్యాలయాన్ని తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి అనంతరం మాట్లాడారు. గ్రామీణ తపాలా జీవిత బీమా (ఆర్‌పీఎల్‌ఐ)దేశ వ్యాప్తంగా గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించిందన్నారు. ఆర్‌పీఎల్‌ఐలో ప్రీమియం తక్కువ బోనస్ ఎక్కువ అన్నారు. కడప డివిజన్ పరిధిలో నెలలోనే రూ.కోటి ప్రీమియం చేసిందన్నారు. రెండు రోజుల్లోనే రూ.22 లక్షల వరకు ప్రీమియం చేసిందన్నారు. 10 సంవత్సరాల లోపు బాలికలకు సుకన్య సమృద్ధి యోజన పథకం అమలులోకి తెచ్చిందన్నారు. పోస్టల్‌లో ఐపీపీబి అనే డిజిటల్ బ్యాంకింగ్ సిస్టం వచ్చిందన్నారు. ఆదార్ కార్డుతో పాటు రూ.200 డిపాజిట్ చేస్తే తక్షణం డిజిటల్ ఖాతా చేయిస్తామన్నారు. కార్యక్రమంలో చక్రాయపేట బ్రాంచ్ పోస్టుమాస్టర్ మహబూబ్‌పీర్, అసిస్టెంట్ పోస్టుమాస్టర్ హబీబ్ పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఇంటింటి న్యాయ ప్రచారం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఇంటింటి న్యాయ ప్రచారంలో భాగంగా గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8035 గృహాలను సందర్శించి 84 మంది ఎదుగుదల లోపాలున్న పిల్లలను గుర్తించామని వైద్యసిబ్బంది తెలిపారు. జిల్లాలో 46 బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారంతా ఇంటింటా తిరిగి ఎదుగుదల లోపాలున్న పిల్లలను గుర్తిస్తారన్నారు. తల్లిదండ్రులు సహకరించాలన్నారు.

ఊసేలేని ఉచిత బస్సు ప్రయాణం

- ఎన్నికల హామీ అమలు చేయకపోవడంపై మహిళల అసహనం
- అధికారంలోకి వచ్చి 8 నెలలవుతున్నా అతీగతీ లేదంటూ విమర్శలు
- ఓట్లేసి మోసపోయామంటూ మహిళల గగ్గోలు



బస్టాండులో ఉన్న ఆర్టీసీ బస్సులు

సింహాద్రిపురం : కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెలలు గడుస్తున్నా హామీలను అమలు చేయక ప్రజలను మోసం చేస్తున్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు, ప్రతి నెలా మహిళలకు రూ.1,500, యువతకు నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు అంటూ సూపర్ సిక్స్ పథకాల కింద హామీలను గుప్పించారు. టీడీపీ కూటమి నేతలు, సీఎం కుర్చీనెక్కిన చంద్రబాబు తూతూ మంత్రంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని ప్రారంభించారు. త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణమంటూ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి ప్రకటించగా.. ఇంకో అమాత్యుడు నారా లోకేష్ రోడ్ మ్యాప్ వేద్దాం.. వచ్చే ఏడాది నుంచి పథకాల అమలుపై దృష్టి సారిద్దామని చెబుతున్నారు. హామీలను చూస్తుంటే భయమేస్తుందని ఏకంగా సీఎం చంద్రబాబు చెప్పడంపై అన్ని వర్గాల ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక ఉచిత ప్రయాణం లేనట్టేనా అని మహిళలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఆర్టీసీ ప్రయాణం అమలు చేశాయి.

ఉచిత బస్సు ప్రయాణంపై స్పష్టత లేదు

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీపై సీఎం చంద్రబాబు ఇప్పటి వరకు కనీసం స్పష్టత ఇవ్వడం లేదు. గత ఏడాది ఆగస్టు 15వ తేదీ నుంచి అని అన్నారు. మళ్లీ మహిళలకు దీపావళి కానుకగా ఉచిత బస్సు ప్రయాణమని వదంతులు సోషల్ మీడియాలో హల్చల్ చేసిన విషయం అందరికీ తెలిసిందే.

మహిళా ఓటర్లను ఆకర్షించేందుకే హామీ

పులివెందుల నియోజకవర్గంలో 1,17,941 మహిళా ఓట్లు ఉన్నాయి. ఇందులో సింహాద్రిపురం మండలంలో మొత్తం ఓటర్లు 25,942 ఉన్నారు. ఇందులో 13,402 మహిళా ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. దీంతో మహిళ ఓటర్లను ఆకర్షించేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని హామీ ఇచ్చారు. తీరా గెలిచాకా హామీలను పట్టించుకోవడం మరచిపోయారు.

హామీ ఇచ్చేటప్పుడు భయం కనిపించలేదా



ఎన్నికల ముందు హామీలు ఇచ్చేటప్పుడు ఆచరణకు సాధ్యమా, అసాధ్యమా అని ఆలోచన చేయాలి. ఎన్నికలలో గెలిచి ముఖ్యమంత్రి పీఠంలో కూర్చొని ఇప్పుడు హామీలను చూస్తుంటే భయమేస్తోందని చెప్పడం సిగ్గుచేటు. హామీలు ఇచ్చేటప్పుడు చంద్రబాబుకు భయం కనిపించలేదా. టీడీపీకి ఓట్లు వేసి మహిళలంతా మోసపోయారు.

\- రూహీన్సీరాణి, జెడ్పీటీసీ, సింహాద్రిపురం

హామీలన్నీ అమలు చేయాలి



మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణమని ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదు. ఎప్పుడు అమలు చేస్తారో కూడా తెలియడంలేదు. పక్క రాష్ట్రాలలో అధికారం చేపట్టిన వెంటనే ప్రభుత్వాలు అమలు చేశాయి కదా? ఇక్కడ ఎందుకు అమలు చేయలేకపోతున్నారు. ఈ పద్ధతి బాగా లేదు. హామీలు అమలు చేయకపోతే వెంటనే రాజీనామా చేయాలి.

\- వెంకటలక్షుమ్మ, స్థానికురాలు, సింహాద్రిపురం

పులివెందుల నియోజకవర్గ అనుబంధ కమిటీ అధ్యక్షుల ఎంపిక

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. యువజన విభాగం అధ్యక్షుడిగా వి.రామలక్ష్మణ్‌రెడ్డి, గగ్గుటూరు సలీమా(మహిళా విభాగం), ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి(రైతు విభాగం) అధ్యక్షుడిగా ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, బీసీసెల్ అధ్యక్షుడిగా చెన్నూరు కార్తీక్, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా అగ్రహారం రవి, ఎస్టీసెల్ అధ్యక్షుడిగా ఎస్.రాజేష్, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎం.అబ్దుల్ బషీర్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా పి.జస్వంత్‌రెడ్డి, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడిగా బి.డేనియల్‌బాబు, లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఎం.ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా చల్లా బాలాజీ, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా ఎస్.వెంకట శివప్రసాద్, వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా సి. రంగనాయకులు, గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడిగా ఏ.సుభాస్ చంద్రప్రసాద్, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా కె. శివశంకర్‌రెడ్డి, వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా ఏ.మిత్రానంద్, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలిగా సి.పద్మావతి దేవి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా సి.భాస్కర్, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా పి.వెంకట్‌రెడ్డి, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడిగా వై.మారుతిమోహన్‌రెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా ఎస్.రజనీకాంత్, క్రిష్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఓ.మోహన్, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా ఎం.పాపన్న, మేధావుల ఫోరం అధ్యక్షుడిగా వై. చంద్రశేఖర్‌రెడ్డి, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా ఎస్.జహీర్‌అహ్మద్, బూత్ కమిటీస్ అధ్యక్షుడిగా సి. నాగేంద్రనాథ్‌రెడ్డి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా కె. నరసింహారెడ్డి ఎంపికయ్యారు.

అన్నమాచార్య కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



ఆచార్య మల్లికార్జునను అభినందిస్తున్న విద్యావేత్తలు

చింతకొమ్మదిన్నె : అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో సహాయ ఆచార్యునిగా పనిచేస్తున్న పి.మల్లికార్జునకు తెలంగాణ రాష్ట్రం హైదరాబాదులోని జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్‌ను ప్రధానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. జవహర్ లాల్ నెహ్రూ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగపు ఆచార్యులు డాక్టర్ పి.ప్రసన్న పర్యవేక్షణలో 'థర్మల్ లోడ్ మేనేజ్మెంట్ ఫర్ ఎన్హాన్స్ మెషినబిలిటీ ఆఫ్ ఈఎస్ 24 మరియు నిమోనిక్ అల్లాయిస్ అండర్ ఎంక్యూఎల్ కండిషన్స్ అనే పరిశోధనలకుగాను ఈ డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. ఆయనను విద్యాసంస్థల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఈడీ అభిషేక్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, సిబ్బంది అభినందించారు.

సమతా కుంభ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

వేంపల్లె : హైదరాబాద్‌లోని షాద్ నగర్‌లో జరిగిన సమతా కుంభ్‌లో చైతన్య పూరిత ప్రదర్శనలో వేంపల్లె శ్రీచైతన్య ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపినట్లు అ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. గురువారం పాఠశాల అవరణలో ప్రతిభ చూపిన విద్యార్థులకు కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి అభినందించారు. శ్రీ చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో ఈనెల 9వ తేదీ నుండి 19తేదీ వరకు జరిగిన సమతా కుంభ్ - 2025 మహోత్సవంలో జరిగిన సంస్కృత కళారంగంలో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు 30 మంది హాజరయ్యారన్నారు. సాంస్కృతిక రంగంలో కొత్త మైలురాయిని చేరుకోవడమే కాకుండా, విద్యార్థులలో ఉన్న సృజనాత్మకత, కృషి, సమూహ భావనకు గుర్తింపు వచ్చిందన్నారు. సమతా కుంభ్ మహోత్సవ సాంస్కృతిక కార్యక్రమంలో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

ఫైలేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



ఫైలేరియా వ్యాధి బాధితులకు చికిత్స చేస్తున్న వైద్యులు

లింగాల : ఫైలేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని లింగాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుభాషిణి తెలిపారు. గురువారం తాతిరెడ్డిపల్లెలో ఫైలేరియా వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా ఎంఎండీపీకి సంబంధించిన కిట్‌ను ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. ఫైలేరియా రోగ బాధితుల నిర్వహణ, వైకల్య నివారణ, వ్యాధి బారినపడిన వ్యక్తులకు తగిన చికిత్స, శరీర శుభ్రత, పునరావాసం వంటి సేవలను అందించడం ద్వారా ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరచడం జరుగుతుందన్నారు. ఫైలేరియా వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ కళ్యాణ్ దినకర్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య, సీహెచ్‌ఓ శివరాం, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రసాయనాలు వద్దు.. కషాయాలు ముద్దు



గోడలపై ప్రకృతి వ్యవసాయ స్లోగన్లను రాస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సింహాద్రిపురం : స్థానిక రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం గోడలపై రసాయనాలు వద్దు.. కషాయాలు ముద్దు అంటూ ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆర్పీ శ్రీనివాసులు సిబ్బంది గోడలపై రాయించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి రామకృష్ణ, ఐసీఆర్పీలు విజయలక్ష్మి, సులోచన, కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

జమ్మలమడుగు రూరల్ : జీవిత బీమా సంస్థలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం స్థానిక బీమా సంస్థ కార్యాలయం ఎదుట సమ్మెను బ్రాంచి అధ్యక్షుడు ఏ.బాలరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి డి.నరసింహ మాట్లాడుతూ జీవిత బీమా సంస్థలో కొన్ని సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడంలో సంస్థ తాత్సారం చేస్తోందన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ టి.వి.సుబ్బయ్య, లియాఫి అధ్యక్షుడు కె.గురుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు కంటి అద్దాలు పంపిణీ

ముద్దనూరు : స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలోని విద్యార్థినులకు కళ్లజోడు పంపిణీ చేశారు. గురువారం పాఠశాలలోని 16 మంది విద్యార్థినులకు కంటి అద్దాలను అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. గతంలో కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఈ కంటి అద్దాలను పంపిణీ చేసినట్లు కంటి వైద్య సహాయకురాలు జీవీ లక్ష్మీదేవి తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

ఎర్రగుంట్ల : మండలంలోని చిలంకూరులో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అకస్మీకంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ప్రధాన సదుపాయాలపై అక్కడే ఉన్న వైద్యాధికారి సాయిచరితరెడ్డితో మాట్లాడి తెలుసుకున్నారు.

జూదరులు అరెస్టు

పులివెందుల రూరల్ : పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు శ్రీకర్ కల్యాణ మండపం సమీపంలో జూద మాడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.10 వేలు నగదు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ నరసింహులు తెలిపారు. కృష్ణమూర్తి, షేక్ ఇమామ్, ఉమామహేశ్వర్, పఠాన్ అస్లాంలను కోర్టుకు హాజరుపరుస్తామని తెలిపారు.

నేటి నుంచి ఇంటింటి సర్వే

లింగాల : మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం నుంచి బిలో ప్రాపర్టీ లైన్ కింద ఉన్న వారిని గుర్తించేందుకు పీ4 సర్వే నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బిలో ప్రాపర్టీ లైన్‌కు దిగువన ఉన్న వారిని 20 శాతం తీసుకుని వారికే ప్రభుత్వ పథకాలు అందించి వారిని అభివృద్ధిపరచడమే లక్ష్యంగా ఈ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు టెలికాన్ఫరెన్స్ ద్వారా సర్వే వివరాలను వెల్లడించారన్నారు. సచివాలయ సిబ్బంది ఈ సర్వే నిర్వహిస్తారని తెలిపారు.

నిత్యపూజకోనకు బస్సులు నడపండి

కడప కల్చరల్: జిల్లాలోని సుప్రసిద్ధ శైవ క్షేత్రం నిత్యపూజకోనకు బస్సులు నడపాలని విశ్వ హిందూ పరిషత్ జిల్లా ప్రాంత ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ రామమహేష్ కోరారు. ఏపీఎస్సార్టీసీ డిపో మేనేజర్‌ను గురువారం ఆయన కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఆయన మాట్లాడుతూ నిత్యపూజ కోనకు రోజూ కడప నుంచి బస్సులు నడపాలని కోరారు. శివరాత్రికి వేసే ప్రత్యేక సర్వీసుల్లో భక్తుల నుంచి టిక్కెట్ పేరిట అధిక ధరలు వసూలు చేయరాదని, కిలోమీటర్ల ప్రకారమే వసూలు చేయాలని కోరారు. మంచి కండీషన్‌గల బస్సులను మాత్రమే నడపాలని, బస్టాండు వద్ద మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇదే వినతులను కడప ఆర్డీఓ, తహసీల్దారు, పోలీసు అధికారులకు అందజేశారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్ సొమ్ము పెంచాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్సార్టీసీలో పనిచేస్తూ 2014కు ముందు ఉద్యోగ విరమణ చేసిన వారికి రూ. 2500 లోపు పెన్షన్ వస్తోందని, కనీసం రూ.5 వేలకు పెంచాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు సగినాల శ్రీనివాసులు, రఘునాథరెడ్డి కోరారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులు రెడ్డిని గురువారం వారు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు పెంచేందుకు హామీ ఇచ్చారన్నారు. శ్రీనివాసులురెడ్డి స్పందించి సమస్యను సీఎం దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారు.

దూదేకులు చైతన్యవంతులు కావాలి

కడప రూరల్: దూదేకులు సామాజిక ఆర్థిక, రాజకీయ రంగాల్లో చైతన్యవంతులు కావాలని దూదేకుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు ఖాదరయ్య తెలిపారు. స్థానిక దూదేకుల భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగిన దూదేకుల వర్గీయులు మిగిలిన సహచరులకు చేయూత నందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అయిల్ మిల్ ఓబులేసు, మహబూబ్‌బాషా, సుభాన్, తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చారు

బీటెక్ రవిపై మండిపడ్డ వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల రూరల్ : తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన మీరు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డిల మీద గెలిచే దమ్ము మీకు ఉందా అని బీటెక్ రవిని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అడిగారు. గురువారం పట్టణంలోని భాకరాపురంలో ఉన్న వైఎస్ జగన్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పులివెందులలో 23వ వార్డు, పులివెందుల జెడ్పీటీసీకి సంబంధించి ఖాళీగా ఉన్న వాటిని బీటెక్ రవి గెలిస్తే రాజకీయ సన్యాసం చేస్తామని వారు తెలిపారు. పులివెందులలో చివరగా ఆగిన అభివృద్ధిని కొనసాగించే ఆలోచన లేదు కానీ ప్రతిసారి పులివెందుల ఉపఎన్నిక గురించి మాట్లాడటం నీ దురాశకు నిదర్శనమన్నారు. నోరు తెరిస్తే అబద్దాలు చెబుతూ పులివెందులను భ్రష్టు పట్టించడం నీకు ఆనవాయితీగా మారిందన్నారు. పదే పదే నువ్వు చెబుతున్న మేఘ సంస్థ ప్రాజెక్ట్ కూడా జగన్ హయాంలో పురుడు పోసుకుని 85 శాతం పనులు పూర్తిచేసుకోగా మిగిలిన పనులకు నిధులు కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చివరలో విడుదల చేశాడన్నారు. ఆ నిధులే క్యారీ ఫార్వార్డ్ చేసి దానిని కూడా మీ గొప్పగా చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఒకవేళ నిజంగా ఉప ఎన్నిక వస్తే నువ్వు, నీ అనుచరుల ఆగడాలతో నీకు టికెట్ ఇస్తారో ఇవ్వరో ఆలోచించుకో అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వచ్ఛందంగా వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ఏదో ఒక విధంగా బురద జల్లి ప్రజల దృష్టిని మరల్చాలనే దుర్బుద్ధితో ఉన్నారన్నారు. ఇప్పటికైనా అధికారం ఉంది కదా అని అహంకారంతో దుర్మార్గపు రాజకీయాలు మానుకుని అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, వేముల జెడ్పీటీసీ కోగటం వెంకట బయపురెడ్డి, వేముల మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివరెడ్డి, నూర్‌బాషా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, సింహాద్రిపురం వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, తొండూరు వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రారెడ్డి, దశరథరామిరెడ్డి, లింగాల వైఎస్సార్‌సీపీ నాయకులు అంబకపల్లె బాబు రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లె కిశోర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బిడులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం, మాగురు, అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు అందిస్తారన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతో పాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

భూసేకరణ పూర్తిచేసి రైతులకు నీరందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆది

ముద్దనూరు : వామికొండ జలాశయం పరిధిలో ఉప కాల్వలకు భూసేకరణ పూర్తిచేసి రైతులకు త్వరగా సాగునీరందించాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని మాదన్నగారిపల్లెలో వామికొండ ఆయకట్టు రైతులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వామికొండ జలాశయం కింద వున్న కుడి, ఎడమ కాలువల నుంచి ముద్దనూరు, ఎర్రగుంట్ల, వీరపునాయునిపల్లె మండలాల్లోని సుమారు 10 వేల ఎకరాలకు నీరందాలంటే డిస్ట్రిబ్యూటరీ కాలువలకు అవసరమైన భూసేకరణ పూర్తి చేయాలని, దీంతో సాగు, తాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. భూసేకరణ పూర్తయి కాలువల ద్వారా నీరందించడానికి సుమారు 100 రోజులు పడుతుందని, రైతుల కోరిక మేరకు ఇతర ఎత్తిపోతల పథకాలను కూడా పరిశీలిస్తామని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

పరీక్షల పట్ల భయం వీడాలి



విద్యార్థినులకు హోమియో మందులు వేస్తున్న హోమియో వైద్యులు షాకీర్ హుసేన్

కమలాపురం : టెన్త్, ఇంటర్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షల పట్ల భయం వీడాలని కమలాపురం ప్రభుత్వ హోమియో వైద్యులు షాకీర్ హుసేన్ తెలిపారు. గురువారం స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాల విద్యార్థులకు పరీక్షల పట్ల భయం వీడేందుకు, పరీక్షల పట్ల ఆసక్తి పెంచుకోవడానికి అవగాహన సదస్సు నిర్వహించారు. భయం పోగొట్టడానికి, అలాగే వారిలో ఆసక్తి కలగడానికి హోమియో వైద్యంలో ఉన్న జేల్సేమియం -200 మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా పరీక్షలంటే విద్యార్థుల్లో ఒక రకమైన భయం ఉంటుందని, అలా భయం ఉంటే చదువుకున్న అంశాలు కూడా మరిచి పోతారని, కచ్చితంగా పరీక్ష రాసే సమయంలో అవి గుర్తుకు రావన్నారు. పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు భయాన్ని వీడాలన్నారు. తద్వారా మీలో ఉన్న టెన్షన్ కూడా తగ్గిపోతుందన్నారు. పరీక్ష గదిలో వెళ్లగానే ప్రశాంతంగా కూర్చోవాలన్నారు. ప్రశ్న పత్రాన్ని ఒకటికి నాలుగు సార్లు బాగా చదివి జవాబులు రాయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తులసమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాన్‌పై అభ్యంతరాలకు ఏడు రోజులు గడువు



ప్లాన్ ముసాయిదాను విడుదల చేస్తున్న కమిషనర్ శేషఫణి, టౌన్‌ప్లానర్స్

ఎర్రగుంట్ల : నగర పంచాయతీ పరిధిలోని న్యూకాలనీ రోడ్డు, మహత్మానగర్ రోడ్డు, బాలాజీ స్కూల్ రోడ్డులపై సర్క్యులేషన్ నెట్ వర్క్ ప్లాన్ తయారైందని, ఈ ప్లాన్‌పై ఏమైన అభ్యంతరాలు ఉంటే ఏడు రోజుల లోపు వ్రాతపూర్వకంగా కార్యాలయంలో తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ శేషఫణి గురువారం తెలిపారు. ఈ మేరకు ఈ ప్లాన్ మూసాయిదాను మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లాన్ సిబ్బందితో కలిసి ఆయన విడుదల చేసి మాట్లాడారు. సర్క్యులేషన్ నెట్ వర్క్ ప్లాన్ ప్రకారం తీసుకుంటే పైన చెప్పిన ఏరియాలలో పాత, కొత్త బిల్డింగ్‌లు నిర్మించుకుంటే రోడ్డు 30 అడుగులు ఉండే విధంగా ప్లాన్ ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి నోటిఫికేషన్ కూడా జారీ అయిందన్నారు.

కంటి సమస్యలపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి

వేంపల్లె : కంటి చూపు అనేది ప్రతి ఒక్కరికి ముఖ్యమని, కంటి సమస్యలపట్ల విద్యార్థులు కూడా జాగ్రత్తగా వహించాలని ఏపీ ఉర్దూ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుగుణమ్మ తెలిపారు. గురువారం స్థానిక పులివెందుల రోడ్డులోని ఏపీ ఉర్దూ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు కంటి వెలుగు పథకం కింద కంటి అద్దాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈనేపథ్యంలో పలువురు హాజరై విద్యార్థులకు కంటి అద్దాలను అందజేశారు. రాష్ట్రంలో ఉన్న అంధత్వ నివారణ చర్యల్లో భాగంగానే కంటి వెలుగు పథకం కింద కంటి పరీక్షలను చేపడుతున్నామని, మనిషికి కళ్లు అనేవి లేకపోతే జీవితమంతా అంధకారమేనన్నారు. కంటికి సమస్య వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలను చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం తినే తిండి ద్వారా, సెల్ ఫోన్ ద్వారా కంటి చూపులో సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని, కంటి సమస్యలపట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రజలందరూ కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిరుపేదల గుడిసెలను తొలగించడం అన్యాయం

జమ్మలమడుగు : ఇళ్లులేని నిరుపేదలు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు ఏర్పాటు చేసుకుంటే వాటిని బద్వేలు రెవెన్యూ అధికారులు తొలగించడంతో పాటు కక్షపూరితంగా వ్యవహరించడం సరైంది కాదని దళితహక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ప్రసాద్ తెలిపారు.

గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి విలేకరులతో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ భూములను కబ్జాలు చేసుకుంటున్నా ఏమాత్రం పట్టించుకోవడంలేదన్నారు. అధికార పార్టీకి చెందిన ఒక ప్రతినిధి బద్వేలు ప్రాంతంలో భూములన్ని అక్రమించుకున్న వారికి సహకరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇళ్లులేని నిరుపేదలకు పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోనికి వచ్చింది. ఇంత వరకు అ హామీలను పట్టించుకోకపోవడం దారుణం కాగా వేసుకున్న ఇళ్లను రెవెన్యూ, పోలీసులతో తొలగించడం అన్యాయం అన్నారు. రెవెన్యూ అధికారులు నిరుపేదల పట్ల కక్షసాధింపు చర్యలను పాల్పడితే జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు.